క థా ని క :

# ★ నిరీక్షిత ★

ముదిలి మహేశ్వరరావు

'అవును ఆమె చాలా అందంగా వుంటుంది'' అన్నది సుగుణ. ఆవాక్య వాక్యంతో సుగుణపట్ల నాగౌరవభావం పెరిగింది. ఎవరో అన్నట్లు ఒకస్త్రీ మరో స్త్రీ అందమైందని ఒప్పుకోవటం చాలతక్కువ.

కానీ విశ్వంమీద మాత్రం నమ్మకం తగ్గిపోసాగింది. ఎప్పుడూ సుధగురించే సంభాషణ, భార్యను గురించి ఆలోచించేవాడు కాదేమో? సుగుణ మాత్రం ఉత్తమ ఇల్లాలనిపిస్తుంది. ఆ నాటిరాత్రి భోంచేసాక మేంముగ్గురం డాబా మీద చేరాం. విశ్వం మొదలు పెట్టాడు. 'నిజంగా ఆమెకళ్ళు—'

అలా ఆ ప్రవాహం సాగవలసిందే. నేను మౌనంగా వింటున్నా. మధ్యలో సుగుణ లేచిపోయేది. 'ఇంట్లో సర్దుకోవాలి' అంటూ.

అప్పుడు విశ్వం డైలాగులు మరీ తీరున పోతాయి.

'ఆవిడ ఇప్పుడు భర్తతో వుండటం లేదు'

'అంటే'

'అంటే—అంతే'

'మరెక్కడ వుంటోంది?'

'వాళ్ళవూళ్ళో అమ్మా, నాన్నదగ్గర'

ఎప్పుడూ సుధ సౌందర్య వర్ణనతోనే సరిపోయేది. ఎప్పుడెప్పుడు ఏటువంటి కలర్సు కట్టుకునేది, ఏవిధంగా అలంకరించుకునేది చెప్పుకు పోయేవాడు,

కానీ మధ్యలో పై సంభాషణ వంటివి కుతూహలాన్ని రేకెత్తించేవి. అంతలోనే కొద్దిగా సందేహం'

'ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు గదూ' అడిగాను

'ఆ, ఏం ప్రేమో, ఆ అమ్మాయి బీదస్థితి లోంచి వచ్చింది. సూర్యనారాయణ తెలుసుగా లక్షాధికారి. చదువుకుందిగా అంచేత ప్రేమించినట్టు నటించుంటుంది' అన్నాడు నిక్కచ్చిగా. విశ్వం మాటల్లో సూర్యనారాయణ మీద కసి కన్పిస్తుంది.

'సుధ కాలిగోటికికూడా సరితూగడోయ్ అతడు.'

మళ్ళీ విశ్వం మాటల్లో అక్కసు. వాడి సొమ్మేదో ఇంకోడు తింటున్నట్టు.

కానీ సాదృశ్యం వేరు. అందాన్ని తీసి పారేయలేక పోయినా, సహృదయంతో అర్థం చేసుకొని అభిమానించడం భర్త ముఖ్యలక్షణం ఆ విధి నిర్వహిస్తే ఉన్నతమే.

కానీ విశ్వం ఈ మాటలకు తోకతొక్కిన త్రాచులా లేస్తాడు.

సుగుణ మెల్లగా నవ్వుతుంది. కాంతులీను కళ్ళల్లో ఆశాజ్యోతులు అగుపిస్తాయి. నా మనస్సులో ఓమూలన బాధ.

ఇంకోరోజు...

'సుధ మళ్ళీ మనవూర్లో అడుగుపెట్టిందోయ్' అతడిమాటలు- అతడిమాటలు ఆశ్చర్యం అనిపించకపోయినా హాస్యాస్పదం అనిపించింది

"అలానా"

"సూర్యనారాయణ దగ్గర కాదులే. మెడికల్ షాపు చంద్రంతో సినిమా హాల్లో కన్పించింది. అక్కడే వుంటోంది ప్రస్తుతం"

"ఆఁ"

"ఏంచేస్తుంది మరి? తను రంభ, అతడు కోతి. తనుచిన్నది. అతడునలభైలో పడ్డాడు. తెలుసుగా...రెండోపెళ్ళి'' స్పష్టంగా కాకపోయినా తానుదేనిలోనో గెలిచినట్టు మాట్లాడాడు.

తర్వాత నేను మరోవూరు వెళ్ళవలసి వచ్చింది.

రెండు నెలలు పోయాక మళ్ళొచ్చాను. విశ్వం కలిసాడు. 'సుధగురించి ఏమీ చెప్పలేదు. తీరా నేనే అడిగితే, ఏదో జరిగింది పోనిద్దూ అని దాటేసాడు. అయితే అంతటితో ఆఖరవలేదు. ఆరోజు సుగుణ నన్ను భోజనానికి వుండి పోమంది.

భోజనాలయాక సుగుణ చెప్పింది. సుధ సూర్యనారాయణ గారితోనే వుంటోందని.

"నీకు పెద్ద తెలిసినట్టు మాట్లాడేవు. వెనకాల ఎంతో తంతు జరిగుంటుంది. పరువు పోతుందని కాళ్ళా వేళ్ళా పడి వుంటాడు సూర్యనారాయణ. జాలిపడి చందాన్ని వదిలేసి వచ్చుంటుంది' విశ్వం అన్నాడు,

'ఏదయితేనేం ఇప్పుడు ఇంటిగుంచి బయటికి అడుగు పెట్టటం లేదుగా' అంది సుగుణ.

విశ్వం ఏం అనలేదు.

ఇతరుల అదృష్టాన్ని ఓర్వలేక అభాండాలు వేసి ఆనందించడం చాలామందికి అలవాటు, వీరులో ఇంచుమించు విశ్వం కూడా ఈ తరగతికి చెందినవాడేనని అనిపించింది.

తర్వాత మా ఆఫీసు ఫ్రెండు చలపతి కలిసాడు. అతడికి సూర్యనారాయణతో కొద్దిగా పరిచయం వుంది. మాటల సందర్భంలో సూర్యనారాయణ, సుధల ప్రసక్తి కూడా వచ్చింది.

'ఈమధ్య సూర్యనారాయణగారు చాలా సంతోషంగా వుంటున్నారు' అన్నాడు.

ఈ రకరకాల మాటలవల్ల కల్గిన అనుభూతే కావొచ్చు. దాంలో నాన్నాళ్లు దాగివుండిన కోరిక బయటికొచ్చింది; ఎలాయినా ఓసారి సుధని చూడాలి. సూర్యనారాయణగారితో మాట్లాడాలి

'సుధను చూడ్డం వీలవుతుందా?' అడిగాను చలపతిని. చలపతి కాస్సేపు ఊరుకొని 'ఆదివారం వెళ్దాంలే' అన్నాడు.
మనసులో ఉత్సాహం హెచ్చయింది.

ఎదురు చూచిన ఆదివారం రానే వచ్చింది

ఆ సాయంకాలం చలపతితో కలిసి బయలేరాం. వీధికి చివరగా వుంది సూర్యనారాయణగారి బంగళా. ముందు చిన్న గార్డెను. చుట్టు ప్రహారి. నడిచి వెళ్ళామేమో చీకటి పడింది. బంగళా అంతా నిశ్శబ్దంగా వుంది.

'లోపలికి పద' చలపతి భుజం తట్టాను.

'పద'

లోపలి కెళ్లాం. హాలుకూడా నిశబ్దంగా వుంది నౌకర్లు ఎవరూ వున్నట్లు లేదు లోపల దీపాలు మాత్రం వెలుగుతున్నాయి.

చలపతి ముందు లెటుపటాయించాడు, అటూ ఇటూ చూసి "సూర్యనారాయణగారూ సూర్యనారాయణగారు" అంటూ పిలిచాడు, ఇంతలోకే ఎక్కడో దూరంగావున్న తోట మాలి, కునుకు తీస్తున్నాడు కాబోలు "ఎవరు బాబూ?" అంటూ దగ్గరికొచ్చాడు.

"సూర్యనారాయణగారి కోసం"

'మేడమీదున్నారు బాబూ. కూచోండి పిలుచుకొస్తా' మేడమెట్లెక్కాడు అక్కడే వున్న సోఫాలో కూచున్నాం.

'ఓహో చలపతి గారూ'

'నమస్కారండీ'

నేనూ నమస్కారం పెట్టాను.

సూర్యనారాయణగారు తెల్లగా వున్నారు కాంతి తగ్గిన వయినా, కళ్లు మాత్రం పెద్దవి. తెల్లటి దుస్తులు, నెరసిన జుత్తు రవ్వంత చెరిగి వుంది.

'వీడు నా స్నేహితుడు' ఫలానా అంటూ నా గురించి చెప్పాడు చలపతి.

'అలాగా'

'మరో విషయం. వీడికి మీపై ప్రత్యేకమైన అభిమానం, ఆసక్తీనూ. సంగతేమిటంటే' చలపతి ఎలా చెప్పాలా అని మాటలకోసం వెదుక్కొనే లోపల ఆయన చిరునవ్వు నవ్వేరు.

'సుధా' అంటూ కేక వేశారు.

సూర్యనారాయణగారు విశ్వం అనుకుంటున్నంత బలహీనత మనిషి కాదనిపించింది.

రెండునిమిషాలు గడిచాయి.

సుధ రాలేదు.

'ఓహో మర్చాను. సుధ బజారెళ్ళింది' ఇప్పుడే వచ్చేస్తుంది. అందాక మేడమీదకు రండి' అన్నారు

సరే. ముగ్గురం మేడమీదకు వెళ్ళాం గదిలోనికి తీసుకెళ్లారు. ఆ గది అందంగా అలంకరించబడివుంది.

పాలు తీసుకరమ్మంటూ తోటమాలిని కేక వేశారు.

'చలపతిగారూ, అసలు సుధ ఒక్కక్షణం లేకపోతే చాలండీ, ఒక్కనౌకరు అగుపించారు ఎక్కడివాళ్లు అక్కడే మాయమవుతారు'

చలపతికి ఏమిటోలా అనిపించినట్టుంది.

కానీ నామమాత్రం, సుధ తన సౌందర్య బలంతోనే అందర్ని ఏలుతుందని నమ్మకం.

'లోపలికి పదండి' అంటూ ఆయన ముందుకు నడిచారు.

ఆగదిలో ఓమూలగా వుంది చిన్నతలుపు పరీక్షచేసి చూస్తేగాని తెలియదు. గోడ డిజైనుతో కలిసివుంది.

పక్కనున్న మీటను తిప్పి ఆ తలుపును తీసారు సూర్యనారాయణ.

ఇద్దరం ఆశ్చర్య పోయాం. అది మరోగది.

పాలవెలుగును చిమ్ముతూ సీలింగ్ మీద తెల్లని దీపం. రాజుల కాలంలో రాణీలు శయనించే తల్పాలవర్ణన వినడమే గాని చూడలేదు. కాని గదిలో వున్న 'బెడ్'ని చూస్తే చాలు చుట్టూ పల్చని మల్లెపూవువంటి తెరతో ఇంగ్లీష్ సినిమాలోని సెట్టింగులా వుంది.

ఇంతలో చలపతి మోచేత్తో పొడిచాడు.

ఏమంటూ వాడివేపు చూశాను కింద అంటూ నేలవేపు చూపించాడు. నేను గుర్తించనేలేదు. నేలంతా మెత్తటి తివాసీలు పరచి వున్నాయి.

మరో ప్రక్కగా నిలువెత్తు అద్దం, దానికి దూరంగా రౌండుటేబుల్ మీద రకరకాల పళ్ళు, పువ్వులు.

'ఆపిల్ పళ్ళన్నా' గులాబీలన్నా సుధకి ప్రాణం అండీ సూర్యనారాయణ అన్నాడు'

దూరంగా అమర్చబడ్డ దంతెంవి, ప్లాస్టర్ అఫ్ పారిస్ బొమ్మలు చూస్తూ నిలబడ్డా.

'ఇది కాలింగ్ బెల్లా' బెడ్‌కి అమర్చబడి వున్న బెల్ నొక్కుతూ అన్నాడు చలపతి. ఎందుకో అందులో కాస్త వెటకారం వున్నట్టు అనిపించింది. ఏమనుకుంటారో అని సూర్యనారాయణవేపు చూశాను.

కానీ ఆయన...

ఆ కళ్ళనిండా ఉత్సాహం కమ్మింది. మనిషిలో ఏదో మార్పు వచ్చినట్లు అనిపించింది. మెల్లగానవచ్చే 'ఫాన్' గాలికి ఆయన సిల్కు చొక్కా రెపరెపలాడుతోంది.

పెదవులమీద నవ్వు. 'అవునండీ సుధకి ఏమన్నా కావలిసివస్తే బెల్ నొక్కుతుంది' అన్నారు ఆయన.

'వెంటనే సేవకులంతా ఒక్కుమ్మడిగా వచ్చేస్తారు గాబోలు' అన్నారు ఆయన.

'అందరికంటె ముందు నేనుంటాను'

అయితే ఈ మాటతో ఆయనమీదగల గౌరవభావం తగ్గలేదు నాకు.

చలపతి ద్వారంవేపు చూస్తున్నాడు.

'రండి. కింద కూచుందాం. సుధ వచ్చేస్తుంటుంది' సూర్యనారాయణతో పాటు కిందకు వచ్చేసాం.

తోటమాలి అక్కడే వున్నాడు. పాలు తీసుకొచ్చాడు.

'పుచ్చుకోండి' ఇద్దరిముందు చెరో గ్లాసు పెట్టారు సూర్యనారాయణ. మేం పాలుతాగుతున్నప్పుడు, ఆయన మేడమీదకు వెళ్ళి ఆల్బం తీసుకొచ్చారు. అందులో అన్నీ సుధ ఫొటోలే.

(తరువాయి 11 వ పేజీ)

## ★ నిరీక్షిత ★

(8 వ పేజీ తరువాయి)

సుధ నిజంగా అపురూప సౌందర్యవతి.

వున్న ఫోటోలు మసైనైఅయినా నేచూసే సరికి చాలా టైము పట్టింది.

'పన్నెండయిందిరా' అన్నాడు చలపతి, వెళ్దాం అన్నట్టుగ.

'పన్నెండా!' సూర్యనారాయణ గభాలున లేచారు.

'సుధ వచ్చేవేళయింది. అన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూడాలి. క్షమించండి' అంటూ గబగబ మేడమీదకు వెళ్ళిపోయారు'

చలపతి మళ్ళీ 'జ్ఞాపకంవుందా, రేపు 7 గంటలకే మనం ఆఫీసులో వుండాల్సింది'అన్నాడు.

సుధని చూడాలని వున్నా, మా బాస్‌ని తల్చుకుంటే భయం వేసింది. తీరా ఇంతదూరం వచ్చి అప్పటివరకూ చూసి సమయానికి వెళ్ళి పోవటం ఏమిటోలా అనిపించింది.

'మరోసారి వద్దాంలే' చలపతి బబ్బపట్టు తున్నాడు, వాడికి చాలా తొందరగవుంది. నిజమే వాడిల్లు మైలున్నర దూరం. రిక్షాలు సినిమాహాళ్ళదగ్గరే వుంటాయి.

సరే. వెళ్ళక తప్పలేదు. బయట కొచ్చే శాం. తోటమాలున్నాడు.

'వెళ్తామని చెప్పవోయ్ అయ్యగారితో' అన్నాడు చలపతి.

'అలాగే అండీ' అన్నాడు వాడు.

'అమ్మగారు మరో పదినిముషాలకల్లా వస్తా రంటావా?' చివరిసారిగ అడిగేశాను.

వాడు నా కళ్ళల్లోకి ఒక్కసారి చూశేడు. కాస్సేపు నిశబ్దంగా వూరుకొని అన్నాడు.

'ఇంకెక్కడి అమ్మగారండీ...'

'ఏం?'

'ఈ మధ్య, అంటే సుమారుగా నెలాపది హేనురోజులక్రితం, అమ్మగారు ఇంటిలోనే వుండేవారండీ, బయటికెప్పుడూ ఒక్క అడుగు కూడా వెయ్యలేదండీ. అయ్యగారు ఏంతో సంబరపడ్డారు. ఒకరోజురాత్రి 8 గంటలకల్లా అమ్మగారు షాపింగ్‌కని బయిల్దేరారండీ. 10 గంటలకల్లా వచ్చేస్తానన్నారు. మళ్ళీ కన్పించనేలేదు. బాబుగారు ఆ రోజునుంచీ ప్రతి రాత్రీ అలానే ఎదురుచూస్తుంటారు పగలల్లా మేడమీదనుంచి కిందకురారు. రాత్రి 8 గంటలు దాటితేచాలు, సుధాదేవి అమ్మగారు వస్తుందని, వస్తుందని అనుకుంటూ జీవిస్తున్నా రండీ' వాడు చెప్పటం ఆపాడు.

'ఎన్నాళ్ళయింది మీ అమ్మగారు వెళ్ళి?' చలపతి అడిగాడు. 'రేపటికి నెలండీ'

'ఆఁ'

చివరిసారి మెల్లిగ అన్నాడు తోటమాలి— 'అయ్యగారి తమ్ముడే అమ్మగార్ని రహస్యంగా చంపించేశారట. వూళ్ళోమాత్రం అమ్మగారు, విసిగి ఇల్లు కదలటంలేదని పుకారు బయిల్దేరిందండీ.'

◆ ◆ ◆

మర్నాడు సాయంత్రం విశ్వంతో ఈ సంగతంతా చెప్పాను.

విశ్వం నవ్వేడు.

"అంతా కట్టుకథ. మరోడితో పోయుం టుంది. లోకంకళ్ళుకప్పటానికికని" అన్నాడు. ఛ. ఛ. ఆ ధోరణి మారలేదు.

అతణ్ని నమ్మించటానికి సాధ్యం కాలేదు నాకు.

ఎన్నో విషయాలు అన్నతర్వాత చివరికి "ఒక వేళ నువ్వు చెప్పింది నిజమే అయిన పక్షములో ఆ పాపం అంతా సూర్యనారాయణదే" అన్నాడు.

కానీ సూర్యనారాయణ గురించి అలా అనుకోలేక పోయేను. దుఃఖాన్ని మర్చిపోడానికి సుధ నివసించినప్రాంతాల్ని వదిలిపోయిన వస్తువుల్ని, మిగిలిన జ్ఞాపకాల్ని ఆరాధిస్తూ కాలం గడుపుతున్నాడు. మానసిక శాస్త్రజ్ఞులు ఇటువంటి అనుభూతిని 'మార్బిడ్' అని ఖండించినా ఏదో ఒక ప్రశాంతత అందులో వుందని, సూర్యనారాయణ దాన్ని పొందుతున్నారని నాకుమాత్రం నమ్మకం.

## నవ్య సాహితీ సమితి

ఈ మధ్య జరిగిన నవ్య సాహితీ సమితి సర్వ సభ్య సమావేశంలో వచ్చే సంవత్సరానికి ఈ క్రింది పేర్కొన్న కార్యవర్గం ఎన్నికైనది.

శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు - అధ్యక్షులు
శ్రీ పి. వి. రాఘవరావు - ఉపాధ్యక్షులు
శ్రీ కప్పగంతుల సత్యనారాయణ ,, (మద్రాసు)
శ్రీ పోతుకూచి సాంబశివరావు - ప్రధాన కార్యదర్శి
శ్రీ వి. వి. జనార్ధనరావు - కార్యదర్శి
శ్రీ చాడా గోపాలకృష్ణ - కోశాధికారి
శ్రీమతి రాధా సుబ్రహ్మణ్యం - ఎడిటర్ బుల్లెటిన్
శ్రీ అడపా రామకృష్ణరావు - సాహిత్యోత్సవ సంఘం అధ్యక్షులు
శ్రీ చంద్రమౌళి - గ్రంథాలయ ఉపసంఘ అధ్యక్షులు
కుమారి వాసిరెడ్డి సీతాదేవి - ఆర్థిక ఉపసంఘ అధ్యక్షులు

ప్రతినిధులను, ఇతర ఉపసంఘాల సభ్యులను కార్యవర్గం త్వరలో నియమిస్తుంది.

పోతుకూచి సాంబశివరావు
ప్రధాన కార్యదర్శి